తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
సోమవారం
23 నవంబర్ 2026
పేజీలు : 08
Follow :



నాలాలపై యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

కళ్లెదుటే కబ్జాలు జరుగుతున్నా పట్టించుకోని ఇరిగేషన్ శాఖ

■ వర్షాకాలంలో ముంపు ముప్పు తప్పదా? ■ ప్రజల ఇబ్బందులపై స్పందించని అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్22 (జనం సాక్షి):

మేడ్చల్–మల్కాజిగిరి మున్సిపల్ పరిధిలోని నాగోల్ సర్కిల్, కుంట్లూరు డివిజన్ పరిధిలో గల తట్టన్నారంలో నాలాల కబ్జాలు, అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ భూములు, నాలాలను పరిరక్షించాల్సిన సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై స్థానిక ప్రజలు తీవ్ర అసహ నం వ్యక్తం చేస్తున్నారు. నాలాలు క్రమంగా కనుమరుగవు తుంటే ఇరిగేషన్ శాఖ అధికారులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి.

వివరాల్లోకి వెళితే.. 90/91 సర్వే నంబర్ల పరిధిలో ఉన్న నాలాను నాగోల్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు వరకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా 90/91 సర్వే నంబర్‌లోని 127/3 పరిధిలో ఉన్న నాలా పూర్తిగా ఆక్రమణకు గురైనట్లు తెలుస్తోంది. అదేవిధంగా తట్టన్నారం సర్కిల్ నుంచి గ్రామంలోకి వెళ్లే మార్గంలోని 127/2 సర్వే పరిధిలో ఉన్న నాలాను సైతం పూర్తిగా కబ్జా చేసి నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేసినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. వర్షాకాలం వస్తే రహదారులే చెరువులుగా..





సర్వే నెంబర్ 75లో గల నాలా

సర్వే నెం 127/3, 127/2లోని నాలాలో నిలిచి ఉన్న నీరు

నాలాల సహజ ప్రవాహ మార్గాలు ఆక్రమణలకు గురికావడంతో వర్షపు నీరు వెళ్లేందుకు దారి లేక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంటోంది. గతంలో 90/91 సర్వే పరిధిలో భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రాంతమంతా చెరువును తలపించేలా మారింది. అప్పట్లో స్వయంగా జిల్లా కలెక్టర్ ఈ ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించిన సందర్భం కూడా ఉంది. అయినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు ఎంతవరకు తీసుకున్నారనే దానిపై స్పష్టత లేకపోవడం గమనార్హం.

75వ సర్వే నంబర్‌లోనూ నాలా ఆక్రమణ

ఇదే ప్రాంతంలోని 75వ సర్వే నంబర్‌లో ఉన్న నాలా సైతం ఆక్రమణకు గురైందని, ఎలాంటి అనుమతులు లేకుండానే షెడ్ల నిర్మాణాలు చేపట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై గతంలోనే 'జనం సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైనప్పటికీ సంబంధిత అధికారుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



90/91, 127/3 సర్వే నెంబర్ లోని నాలా

అధికారుల బాధ్యత ఏమైంది?

నాలాల పరిరక్షణ, నీటి ప్రవాహానికి ఆటంకం కలగకుండా చూడటం ఇరిగేషన్ శాఖతో పాటు సంబంధిత శాఖల బాధ్యత. ప్రభుత్వ రికార్డుల్లో నాలాలుగా నమోదైన ప్రాంతాల్లో ఆక్రమణలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు, వార్తలు వెలువడుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేసి చర్యలు తీసుకోకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, మున్సిపల్ అధికారులు స్పందించి 90/91, 127/3, 127/2, 75వ సర్వే నంబర్లలోని నాలాలపై సమగ్ర సర్వే నిర్వహించాలి. ప్రభుత్వ రికార్డుల ఆధారంగా నాలాల అసలు హద్దులను గుర్తించి, ఆక్రమణలు జరిగినట్లు నిర్ధారణ అయితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. నాలాల సహజ నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న నిర్మాణాలపై నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టి, వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు పేర్కొంటున్నారు.ప్రజలకు ముంపు సమస్యలు తలెత్తిన తర్వాత స్పందించడం కాదు.. ముందుగానే మేల్కొని నాలాలను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు తీసుకుంటారా? లేక నాలాల కబ్జాలు ఇలాగే కొనసాగుతాయా? అన్నది వేచి చూడాల్సిందే.



69/1 భూమికి 224 నంబర్ ముసుగు

- మదినగూడ ప్రభుత్వ భూమి కబ్జా వెనుక పక్కా ప్లాన్
- రిజిస్ట్రేషన్ల నుంచి నిర్మాణ అనుమతుల వరకు అధికారుల అండ
- మూడు శాఖల నిర్లక్ష్యంతో రూ.300 కోట్ల భూమి హాంఫట్..!
- భూ అక్రమార్కుల కబ్జాల వెనుక వెలుగుచూస్తున్న దారుణాలు

శేరిలింగంపల్లి నియోజక వర్గం మియాపూర్ సర్కిల్ పరిధి మదీనాగూడ రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న భూకబ్జా వెనుక కచ్చితంగా ఒకపక్క ప్లాన్ ఉందని, ఆ ప్రకారంగానే భూమి స్వాహా జరిగి అక్రమార్కుల చెరలో హారతి కర్పూరంగా మారుతుందని మదీనాగూడవాసులు స్పష్టం చేస్తున్నారు. ముంబై జాతీయ రహదారిపై ప్రతిరోజు కొన్ని వేల కళ్ళ నిఘాను దాటుకొని నిరంతరంగా ప్రభుత్వభూమి కబ్జా అవుతుందంటే అది మామూలు విషయం కాదని, దీని వెనుక ఒక నిర్దిష్ట వ్యవస్థీకృత విధానం తెరవెనక మాస్టర్ ప్లాన్ కచ్చితంగా అమలవుతూ పద్ధతి ప్రకారం సదరు భూమిని ఆక్రమిస్తూ దాంట్లో భవనాలను నిర్మించి తిరిగి ప్రజలకే అమ్మేస్తూ రాత్రికి రాత్రి కోట్ల రూపాయలను సొమ్ము చేసుకుంటూ ఉండడం ఆలోచించాల్సిన అంశం. దాదాపు 450 కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి దశాబ్దాలుగా అత్యంత దైన్య స్థితిలో దళారుల పాలిట బంగారు బాతుగా మారిపోతోంది.

లోపలి పేజీలో

శేరిలింగంపల్లి, నవంబర్ 22 (జనంసాక్షి)

బీజేపీ కీసర డివిజన్ ప్రధాన కార్యదర్శిగా చిరంజీవి

నియామక ఉత్తర్వులు జారీచేసిన డివిజన్ అధ్యక్షుడు కోల బాల్‌రాజ్ యాదవ్



కీసర, నవంబర్ 22 (జనంసాక్షి) : మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ ఆదేశాల మేరకు యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన కొమ్ము చిరంజీవిని బీజేపీ కీసర డివిజన్ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు డివిజన్ అధ్యక్షుడు కోల బాల్‌రాజ్ యాదవ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా, డివిజన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ కీసర డివిజన్‌లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

అటవీ గ్రామాల రహదారి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చొరవ

డీఎఫ్ఓతో చర్చించిన డాక్టర్ రామ్మోహన్ రెడ్డి.. కొత్తపల్లి రఘు కృతజ్ఞతలు



చౌడాపూర్, నవంబర్ 22, జనం సాక్షి: పరిగి నియోజకవర్గ పరిధిలోని అటవీ ప్రాంత గ్రామాల రహదారి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డికి కొత్తపల్లి యువ నాయకుడు రఘు కృతజ్ఞతలు తెలిపారు. వికారాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారి (డీఎఫ్ఓ) విశాల్‌తో ఎమ్మెల్యే చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా కొత్తపల్లి నుంచి కన్మన్ కాల్వ వరకు, మల్కాపూర్ నుంచి వీరాపూర్ వరకు అటవీ ప్రాంతాల్లోని రహదారుల సమస్యలతో పాటు, నియోజకవర్గంలోని పలు అటవీ గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న రాకపోకల ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంపై హర్షం వ్యక్తం చేశారు. కొత్తపల్లి గ్రామ రహదారి సమస్యను ప్రత్యేకంగా ప్రస్తావించి, గ్రామ ప్రజల అవసరాలను అధికారులకు వివరించడం ఎమ్మెల్యేకు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

తులేకలాన్ గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం

400 మందికి ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ



ఇబ్రహీంపట్నం, నవంబర్ 22(జనం సాక్షి) : బి.ఆర్.ఆర్ ఫౌండేషన్ సహకారంతో, సాయి కీర్తన్ రెడ్డి లెగసి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని తులేకలాన్ గ్రామంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఘనంగా నిర్వహించబడింది. ఈ శిబిరానికి గ్రామ ప్రజల నుండి విశేష స్పందన లభించింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బి.ఆర్.ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రామిరెడ్డి హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 400 మందికి పైగా ప్రజలు హాజరై నిపుణులైన వైద్యులచే ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షల అనంతరం రోగులకు అవసరమైన మందులను నిర్వాహకులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తులేకలాన్ గ్రామ సర్పంచ్ సామ అశ్విని రవీందర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కౌన్సిలర్ చిలుకల బుగ్గ రాములు, మాజీ సర్పంచులు చిలుకల యాదగిరి, బీరప్ప, బి.ఆర్.ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నూతన బీజేపీ మండల అధ్యక్షుడికి ఘన సన్మానం



యాలాల నవంబర్ 22 (జనం సాక్షి) : యాలాల మండల భారతీయ జనతా పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా మాజీ ఎంపీపీ, జిల్లా ఎన్నికల కమిటీ చైర్మన్ బాలేశ్వర్ గుప్తా నూతన మండల అధ్యక్షుడిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలియజేశారు. అనంతరం బాలేశ్వర్ గుప్తా మాట్లాడుతూ.. మండలంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా నూతన అధ్యక్షుడు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యకర్తలకు సముచిత ప్రాధాన్యతనిస్తూ, సీనియర్ నాయకులు, యువతను కలుపుకొని సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.పార్టీ అభివృద్ధి అనేది ఒక్కరి బాధ్యత కాదని, ప్రతి కార్యకర్త సమష్టి కృషితోనే సంస్థాగతంగా బలోపేతం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వాన్ని అందించాలని సూచించారు. యాలాల మండలంలో బీజేపీకి మరింత ఆదరణ పెరిగేలా నూతన అధ్యక్షుడు తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

కార్తీక శోభ.. సత్యనారాయణ స్వామి వ్రతాల వైభవం

చీర్యాల లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు







కీసర, నవంబర్ 22 (జనంసాక్షి) : కార్తీక మాసంలో శివకేశవుల ఆరాధన, సత్యనారాయణ స్వామి వ్రతాలతో ఆధ్యాత్మిక ప్రశాంతత లభిస్తుందని ఆలయ వ్యవస్థాపకులు, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం చీర్యాల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం సప్తవృక్షాలు, నాగదేవత వద్ద కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ధర్మకర్త శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు భారీ షాక్

తుమ్మలపల్లి సర్పంచ్ రాజుతో పాటు భారీ చేరికలు

ప్రజా ప్రభుత్వ పాలనకు ఆకర్షితులై కాంగ్రెస్ లో చేరిక



మర్పల్లి నవంబర్ 22 (జనం సాక్షి) : వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పల్లి మండలం తుమ్మలపల్లి గ్రామంలో బీఆర్ఎస్ కు భారీ షాక్ తగిలింది. తుమ్మలపల్లి గ్రామ సర్పంచ్ కర్నే రాజు ఆధ్వర్యంలో దాదాపు 200 మంది బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మర్పల్లి మండల అధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తుమ్మలపల్లి సర్పంచ్ తో పాటు వార్డు మెంబర్లు, కార్యకర్తలు, సీనియర్ నాయకులు పార్టీ కండువా కప్పుకొని కాంగ్రెస్ లో చేరారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు నచ్చి తామంతా కాంగ్రెస్ లో చేరుతున్నట్లు వెల్లడించారు. ప్రజా ప్రభుత్వ పాలనకు, ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులైలి తాము కాంగ్రెస్ లో చేరామని తుమ్మలపల్లి సర్పంచ్, వార్డు మెంబర్లు, కార్యకర్తలు తెలిపారు. వికారాబాద్ శాసనసభ్యులు, శాసనసభ సభాపతి, గడ్డం ప్రసాద్ కుమార్ సహకారంతో, వారి సలహాలు, సూచనలతో తుమ్మలపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటామని సర్పంచ్ కర్నే రాజు తెలిపారు. స్పీకర్ ఆశీస్సులతో గ్రామంలో రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరుస్తామని, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామ అభివృద్ధికి కృషి చేసేందుకే కాంగ్రెస్ పార్టీలో చేరామని, ఇక నుంచి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, గ్రామ అభివృద్ధికి కలిసి కట్టుగా పని చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సురేష్ యాదవ్, సర్పంచ్ రామేశ్వర్, సర్పంచ్ల సంఘం అధ్యకులు రఫీయుద్దీన్, తుమ్మలపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



బీజేపీ రాష్ట్ర యువ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా బోయిని శివ

శామీర్ పేట్, నవంబర్ 22(జనంసాక్షి) : భారతీయ జనతా పార్టీ తెలంగాణ యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బోయిని శివ నియ మితులయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కుండే గణేష్ చేతుల మీదుగా బోయిని శివ నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం మేడ్చల్ రూరల్ ప్రెసిడెంట్ రాగం అర్జున్, వరప్రసాద్ రెడ్డి, దేశం పవన్ గౌడ్, ప్రసాద్ రెడ్డి, కార్తిక్ రెడ్డి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బోయిని శివ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బాధ్యతలు అప్పగించిన తెలంగాణ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కుండే గణేష్ కి, రాష్ట్ర కమిటీకి, భారతీయ జనతా పార్టీ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడి రాజీనామా వెనుక చర్చ



యాలాల నవంబర్ 22 (జనంసాక్షి) : యాలాల మండల భారతీయ జనతా పార్టీలో చోటుచేసుకున్న నాయకత్వ మార్పు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మండల బీజేపీ అధ్యక్షుడిగా కొనసాగిన దేవనూరు మాజీ సర్పంచ్ ఆకుల శివకుమార్ తన పదవికి రాజీనామా చేయడం, ఆ రాజీనామా లేఖను జిల్లా అధ్యక్షుడు యు. రమేష్ కుమార్‌కు అందజేయడం, వెంటనే రాజీనామా ఆమోదం పొందడం, ఆ వెంటనే నూతన మండల అధ్యక్షుడి ఎంపిక జరగడం వంటి పరిణామాలు తక్కువ వ్యవధిలోనే చోటుచేసుకున్నాయి. అయితే ఈ పరిణామాల వెనుక అసలు కారణాలేమిటన్న ప్రశ్నలు పార్టీ శ్రేణుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఆకుల శివకుమార్ తన అధ్యక్ష పదవికి రాజీనామా చేయడం వెనుక పార్టీ అధిష్ఠానం సూచనలు ఉన్నాయా ? లేక ఆయన స్వచ్ఛందంగానే ఈ నిర్ణయం తీసుకున్నారా ? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన ఆకుల శివకుమార్ పార్టీ పరంగా మరేదైనా ఉన్నత స్థాయి బాధ్యతలు ఆశిస్తున్నారా? భవిష్యత్తులో పార్టీ జిల్లా స్థాయిలో లేదా మరేదైనా కీలక పదవిలో అవకాశం కల్పిస్తారనే హామీతో ఈ నిర్ణయం తీసుకున్నారా? అన్న చర్చ కూడా కార్యకర్తలలో ఆసక్తిని రేకెత్తిస్తుంది. మరోవైపు మండల స్థాయిలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల నుంచి ఆశించిన సహకారం లభించకపోవడం కూడా రాజీనామాకు కారణమైందా? పార్టీ కార్యక్రమాల నిర్వహణలో సమన్వయ లోపాలు ఎదురయ్యాయా? నాయకత్వ బాధ్యతలు నిర్వహించే క్రమంలో అంతర్గతంగా ఏవైనా విభేదాలు తలెత్తాయా? అనే ప్రశ్నలు కూడా కార్యకర్తల మధ్య చర్చకు వస్తున్నాయి.

జమ్మికుంట మున్సిపాలిటీలో ఉన్న పలు సమస్యలు తీర్చండి

మున్సిపల్ కమిషనర్ను కోరిన సిపిఎం పార్టీ జమ్మికుంట పట్టణ కార్యదర్శి దండిగారి సతీష్



జమ్మికుంట, నవంబర్ 22 (జనం సాక్షి):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఇందిరమ్మ ఇండ్లు,ఆసరా పెన్షన్లు పేదవారికి అందడం లేదని జమ్మికుంట పట్టణ సిపిఎం పార్టీ కార్యదర్శి దండిగారి సతీష్ అన్నారు. ఆదివారం సిపిఎం పార్టీ సమావేశం జమ్మికుంట పట్టణంలో తూర్పాటి నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిపిఎం జమ్మికుంట పట్టణ కార్యదర్శి దండిగారి సతీష్ హాజరై మాట్లాడుతూ జమ్మికుంట పట్టణంలో 30 వార్డుల్లో అనేక సమస్యలు ఉన్నాయని అన్నారు. నాయిని చెరువును అభివృద్ధి చేయలేదని,రిజర్వాయర్ చేస్తే పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ఉంటుందని,మినీ ట్యాంక్ బండ్, వాకింగ్ ట్రాక్ చేస్తామని అప్పుడు ఉన్న పాలకవర్గం అన్నారని అన్నారు.ఇప్పుడున్న పాలకవర్గం అట్టి సమస్యలను పట్టించుకోవడం లేదని అన్నారు.అదేవిధంగా జమ్మికుంట పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని రోడ్లు,స్ట్రీట్ లైట్లు, డ్రైనేజ్, కరెంటు, దోమల,కోతుల,సమస్యలు ఉన్నాయని ఇవన్నీ కమిషనర్ దృష్టికి తీసుకుపోతామని అవి వెంటనే పరిష్కరించకపోతే జమ్మికుంట పట్టణంలో ఉన్న ప్రజలను ఏకం చేసి ఆందోళన పోరాటాలను చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో వడ్లూరి కిషోర్, తాటికంటి రంజిత్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్లో బీజేపీ మహా పాదయాత్రను విజయవంతం చేయాలి

బీజేపీ సీనియర్ నాయకుడు కాశెట్టి కుమార్ పిలుపు



హుజూరాబాద్, నవంబర్ 22 (జనం సాక్షి) :కరీంనగర్లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నేతృత్వంలో సోమవారం నిర్వహించనున్న మహా పాదయాత్రను కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చేయాలని బీజేపీ సీనియర్ నాయకులు కాశెట్టి కుమార్ కోరారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ...బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఈ మహా పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో ఒక చారిత్రాత్మక ఘట్టంగా నిలవనుందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో కరీంనగర్ గడ్డపై నిర్వహించనున్న ఈ కార్యక్రమం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతుందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా బీజేపీ ప్రజా విశ్వాసాన్ని చూరగొంటూ అభివృద్ధి, సంక్షేమం, దేశ భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని కొనియాడారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ నాయకత్వం పార్టీకి మరింత దిశానిర్దేశం చేస్తుందని, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు నాయకత్వంలో తెలంగాణలో పార్టీ సంస్థాగతంగా మరింత బలోపేతమవుతోందని పేర్కొన్నారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, తెలంగాణలో బీజేపీ బలోపేతానికి విశేష కృషి చేస్తున్నారని అన్నారు. ఆయన నాయకత్వం రాష్ట్రంలోని యువతకు, పార్టీ కార్యకర్తలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. లరాష్ట్రంలోని ప్రతి జిల్లాలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో కరీంనగర్కు తరలివచ్చి మహా పాదయాత్రలో భాగస్వాములు కావాలని కోరారు. పార్టీ ఐక్యతను, బీజేపీ బలాన్ని చాటుతూ ఈ మహా పాదయాత్రను చరిత్రలో నిలిచిపోయేలా విజయవంతం చేయాలని కాశెట్టి కుమార్ విజ్ఞప్తి చేశారు.

రుద్రంగిలో నేటి నుండి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి తిరునాళ్లు జాతర

చైర్మన్ సామ మోహన్ రెడ్డి



రుద్రంగి, నవంబర్ 22 (జనం సాక్షి)రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో ప్రహ్లాద పర్వతంపై సోయంబుగా వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవం, జాతర ఉత్సవాలు నేటి నుండి అనగా సోమవారం నుండి బుధవారం వరకు మూడు రోజుల పాటు ఘనంగా జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ సామ మోహన్ రెడ్డి తెలిపారు.ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ... ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో పౌర్ణమి రోజున ఇట్టి జాతర మహోత్సవం వైభవంగా జరుగుతుందని, స్వామివారిని దర్శించుకుంటే కోరిన కోరికలు తీరుతాయని ప్రజలు పురాతన కాలం పూర్వీకుల నుండి వస్తున్న ఆనవాయితీగా ఇట్టి జాతర మహోత్సవం జరుగుతుందన్నారు.భక్తులు చుట్టుపక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.ఉత్సవాల వివరాలు ఇలా ఉన్నాయి:23వ తేదీ సోమవారం: సాయంత్రం 6.30 గంటలకు అత్యంత వైభవంగా పుష్పాలంకరణలో గోదావరి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవము జరుగుతుంది.24వ తేదీ మంగళవారం: ఉదయం నుండి తిరునాళ్ళు (జాతర), అన్నదాన కార్యక్రమము జరుగుతుంది. అనంతరం సాయంత్రం నాగవల్లి, రాత్రి నిత్యోత్సవములతో యక్షగానము నిర్వహించబడుతుంది.25వ తేదీ బుధవారం: ఉదయం శ్రీ స్వామి వారి రథోత్సవము జరుగుతుంది. కావున భక్తులం దరూ భక్తి శ్రద్ధలతో ఉత్సవాలలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాద ములను స్వీకరించగలరని ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఈర్నం నవీన్,గుగ్గిల తిరుపతి, ఆకుల పెద్దన్న, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొంటారు.

దీక్షా దివస్ బహిరంగ సభను విజయవంతం చేయాలి

వినూత్నంగా వాల్ రైటింగ్ రాసిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



మంథని, నవంబర్ 22 (జనంసాక్షి) : ఈ నెల 29న కరీంనగర్ అలుగునూర్లో నిర్వహించే దీక్షా దివస్ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పిలుపునిచ్చారు. ఆదివారం పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ పరిధిలోని గంగాపురిలో కేసీఆర్ దీక్షా దివస్ బహిరంగ సభపై వినూత్నంగా వాల్ రైటింగ్ రాశారు. యువతకు చరిత్ర తెలియాలిఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ నాయకత్వంలో జరిగే బహిరంగ సభ నేటి యువతకు చరిత్ర తెలిసేలా నిర్వహించడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏ విధంగా సాధించుకున్నాం? రాష్ట్ర సాధన కోసం ఉద్యమం ఎలా జరిగింది? గత పదేళ్లలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి ఏమిటి? ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలనలో ఏం చేస్తోంది? అనే విషయాలను యువతకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. దీక్షా దివస్ ప్రారంభమైన రోజు పుట్టిన పిల్లలకు నాటి ఉద్యమం ఏ విధంగా జరిగిందో, తెలంగాణ ఏ విధంగా సాకారమైందో తెలియదన్నారు. చరిత్ర ఎవరైతే తెలుసుకుంటారో వాళ్లే చరిత్ర సృష్టిస్తారనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. అలుగునూరులో జరిగే దీక్షా దివస్ సభకు మంథని నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు, అభిమానులు, ఉద్యమకారులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కమ్ముకున్న దట్టమైన పొగమంచు



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 22 (జనంసాక్షి) వేములవాడలో ఆది వారం తెల్ల వారు జామున దట్టమైన పొగమంచు కమ్మేసింది. మంచు తెరలతో పట్టణ రహదారులు, పరిసర ప్రాంతాలను ఆవరించడంతో కొద్ది దూరంలో ఉన్న వాహనాలు,భవనాలు సైతం స్పష్టంగా కనిపించని పరిస్థితి నెలకొంది. పొగమంచుతో కమ్ముకున్న పట్టణ పరిసరాలు కోనసీమ అందాలను తలదన్నేలా ప్రకృతి సోయగాన్ని సంతరించుకున్నాయి. ఉదయం వేళ మంచు తీవ్రత ఎక్కువగా ఉండటంతో రహదారులపై ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించారు. దృశ్యమానత తగ్గడంతో వాహనాలు నెమ్మదిగా సాగాయి .మంచు తెరల మధ్య వేములవాడ ప్రకృతి కనువిందు చేసింది.

స్వర్ణ పథకం సాధించిన గురుకుల విద్యార్థిని



మల్యాల నవంబర్ 22 (జనం సాక్షి)మల్యాల మండలం తాటిపల్లి గ్రామంలోని గురుకుల పాఠశాల కళాశాల విద్యార్థిని ఆర్.మనీషా(ఇంటర్ సెకండియర్) మెట్పెల్లి మండలంలోని వెంపేటలో జరిగిన జగిత్యాల జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ రేస్ లో భాగంగా అండర్ 18 బాలికల 4 కిలో మీటర్ల విభాగంలో బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ మానస,పిఈటి తెలిపారు. మనీషాను ప్రిన్సి పాల్,పిఈటి, ఉపాధ్యాయ బృందం,తోటి విద్యార్థినిలు అభినందించారు.

కుటుంబ సమేతంగా ఆదివరాహ స్వామిని దర్శించుకున్న మంత్రి పీఏ చంద్రశేఖర్



కమాన్పూర్, నవంబర్ 22, (జనంసాక్షి): పెద్దపల్లి జిల్లా కమాన్పూర్ మండల కేంద్రంలోని స్వయంభు శ్రీ ఆదివరాహ స్వామి దేవస్థానాన్ని, రామగిరి మండలంలోని సుందిళ్ల శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్బాబు పీఏ ఆకుల చంద్రశేఖర్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ముస్త్యాల దామోదర్, ఈవో కాంతారెడ్డి, ఆలయ అర్చకులు, కమిటీ డైరెక్టర్లు చంద్రశేఖర్ దంపతులను శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఆర్చరీలో సత్తా చాటిన కమాన్పూర్ విద్యార్థినులు



కమాన్పూర్, నవంబర్ 22 (జనం సాక్షి) : పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటినరీ కాలనీ రుద్రమదేవి స్టేడియంలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్చరీ పోటీలలో కమాన్పూర్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు అత్యున్నత ప్రతిభ కనబరిచారు. 9వ తరగతి చదువుతున్న ఎం. శ్రీనిత్య, 7వ తరగతి చదువుతున్న ఎం. మితాలి, ఎం. సహస్ర రజిత పతకాలు గెలిచి, నిర్మల్లో జరిగే రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలోనూ సత్తా చాటాలిరాష్ట్రస్థాయి పోటీలకు తమ విద్యార్థినులు ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి ఇల్లందుల విజయ్ కుమార్ విద్యార్థినులను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలలో కూడా ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఇందుకు కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్ బండి రేణుకను ప్రత్యేకంగా అభినందించారు. శ్రీనిత్య, మితాలి, సహస్రలకు పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

జవహర్‌నగర్ అభివృద్ధికి బాటలు వేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే

కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు: ఎమ్మెల్యే మల్లారెడ్డి



జవహర్‌నగర్: నవంబర్ 22 (జనంసాక్షి):జవహర్‌నగర్‌లో జరిగిన అభివృద్ధి పనులన్నీ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే చేపట్టామని మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆదివారం జవహర్‌నగర్ డివిజన్ కేఎన్ఆర్ నగర్‌లోని నోబుల్ హైస్కూల్ వద్ద నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ చేరికల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రైతులు, వ్యాపారులు, ప్రైవేటు ఉద్యోగులు, చిన్న తరహా పరిశ్రమల నిర్వాహకులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు కాలుష్యంతో ప్రజలు గత 25 ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, జవహర్‌నగర్‌ను మరింత అభివృద్ధి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు వార్డుల్లోకి వస్తే ప్రజలు తమ సమస్యలపై నిలదీయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు, యువకులు, కార్యకర్తలు సుమారు 150 మంది మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పొలాస అశోక్, రాజేశ్వర్, రాము, మామిడిపల్లి పరమేష్ చారి, ప్రభాకర్, రాజు, హరీష్, అజీమ్, అరవింద్, సంజయ్, సంపత్, అనిల్, గణేష్, సంతోష్, వంశీ తదితరులు ఉన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చామకూర మహేందర్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, మాజీ మేయర్ మేకల కావ్య, మాజీ కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాచారం మండల వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం



యాచారం, నవంబర్ 22(జనం సాక్షి) యాచారం మండల వ్యాప్తంగా పల్స్ పోలియో చుక్కల మందు పంపిణీ కార్యక్రమం ఆదివారం నాడు అత్యంత ఘనంగా, విజయవంతంగా జరిగింది. మండలంలోని యాచారం లో సర్పంచ్ మస్కు అనిత శరణం,మేడిపల్లి లో ముచర్ల సుగుణ సంపత్, నంది వనపర్తి లో విజయ్ కుమార్, తాడి పర్తి నీలం జాన్సీ పాల్గొని పోలియో చుక్కల కార్యక్రమం ను విజయ వంతం చేశారు.తల్లులు తమ ఐదేళ్ల లోపు చిన్నారుల కు ఉత్సాహంగా పోలియో చుక్కలు వేయించారు.మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో స్థానిక ప్రజాప్రతినిధులు మరియు వైద్యాధికారులు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, పోలియో రహిత సమాజ నిర్మాణం కోసం 0 నుండి 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా రెండు చుక్కల పోలియో మందు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు.మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది ఉదయం నుండే అందుబాటులో ఉండి సేవలందించారు. బస్టాండ్లు, ప్రధాన కూడళ్ల వద్ద ప్రత్యేక మొబైల్ బృందాలను ఏర్పాటు చేసి ప్రయాణంలో ఉన్న చిన్నారులకు కూడా చుక్కల మందు వేశారు.ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ రాజ్య లక్ష్మి , వివిధ గ్రామాల సర్పంచ్ లు , పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం

హాస్టళ్లలో కనీస వసతులు కల్పించాలి.. ఎస్ఎఫ్ఐ డిమాండ్



చేవెళ్ల, నవంబర్ 22 (జనంసాక్షి) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల మండల కార్యదర్శి మాల చందు విమర్శించారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని బీసీ బాలుర వసతి గృహంలో ఆదివారం స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులతో సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాల చందు మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల సాధన కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన భోజనం, స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన విద్యా సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించి వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు. అనంతరం చేవెళ్ల బీసీ బాలుర వసతి గృహం నూతన కమిటీని ఎన్నుకోగా అధ్యక్షుడిగా హర్షవర్ధన్, కార్యదర్శిగా సిద్ధార్థ్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులకు ఎస్ఎఫ్ఐ నాయకులు అభినందనలు తెలిపారు. విద్యార్థులందరినీ ఐక్యం చేస్తూ హాస్టళ్లలో నెలకొన్న సమస్యల పరిష్కారం, విద్యార్థుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడాలని నూతన కమిటీకి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రవీణ్, కార్తీక్, సాయికిరణ్, రవితేజ, రామ్ చరణ్, శ్రీకాంత్, శివ, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

అలియాబాద్ మున్సిపాలిటీలో పల్స్ పోలియో

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు శిబిరాలను సందర్శించిన చైర్‌పర్సన్ శీరిష కృష్ణారెడ్డి



శామీర్ పేట్, నవంబర్ 22(జనం సాక్షి)అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని లాల్గడి మలక్‌పేట, మజీద్‌పూర్, అలియాబాద్ ప్రాంతాల్లో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కంటం శిరీష కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ మాలతి మాధవరెడ్డి, కౌన్సిలర్లు జస్వంత్ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు శిబిరాలను చైర్‌పర్సన్ సందర్శించి, ఆన్లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా నమోదు కార్య క్రమాన్ని వేగవంతం చేయ్యాలని, అర్హులైన కుటుంబాలందరికీ పథకం ప్రయోజనాలు అందేలా చూడాలని సిబ్బందికి తగిన సూచనలు చేశారు.పిల్లల ఆరోగ్య రక్షణలో పల్స్ పోలియో కార్యక్రమం ఎంతో కీలకమని, అదే విధంగా ప్రతి కుటుంబానికి భద్రత కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపు నిచ్చారు.ప్రజారోగ్యం, కుటుంబ భద్రతకు ప్రాధాన్యతనిస్తూ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ప్రజలు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని ఆమె సూచించారు.

నూతన వధూవరులకు ఆశీస్సులు

పెళ్లి వేడుకలో నాయకుల సందడి

లక్ష్మీనగర్ తండా సర్పంచ్ గోపాల్ కుమార్తె వివాహానికి హాజరైన కాంగ్రెస్ నాయకులు,



ధారూర్ నవంబర్ 22(జనంసాక్షి)వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదిస్తూ పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు సందడి చేశారు.ఆదివారం ధారూర్ మండల కేంద్రంలోని శుభం ఫంక్షన్ హాల్‌లో లక్ష్మీనగర్ తండా సర్పంచ్ గోపాల్ కుమార్తె వివాహ వేడుక ఘనంగా నిర్వహించారు.ఈ వివాహ వేడుకకు ధారూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మాన్సింగ్,టౌన్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ వార్డు సభ్యుడు మహమ్మద్ దావూద్,నాగసముందర్ గ్రామ సర్పంచ్ కొల్లి వెంకటేశ్వర్,నర్సాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కావాలి కాశీరాం ,విఐపీ హోటల్ యజమాని రవి తదితర ప్రముఖులు హాజరయ్యారు.వివాహ వేడుకలో వధూవరులను ఆశీర్వదించి,వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.కుటుంబ సభ్యులతో కలిసి వివాహ వేడుకలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. నాయకులు, ప్రము ఖుల రాకతో పెళ్లి వేడుక సందడిగా మారింది.

చిలుకానగర్‌లో ఘనంగా 47వ ఉర్సు ముబారక్ వేడుకలు

దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఉప్పల్, నవంబర్ 22 (జనం సాక్షి): ఉప్పల్ నియోజకవర్గంలోని చిలుకానగర్ మల్లికార్జున నగర్‌లో హజ్రత్ బదియుద్దీన్ అహ్మద్ ఖుబూల్ మదార్ (రహ్మతుల్లాహి అలైహి), హజ్రత్ జిందా షా మదార్ దర్గా (చిల్లా ముబారక్) వద్ద నిర్వహించిన 47వ వార్షిక ఉర్సు ముబారక్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, శాంతి సామరస్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.

చలో కలెక్టరేటును జయప్రదం చేయండి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య



రంగారెడ్డి, నవంబర్ 22 (జనంసాక్షి) ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను ఉధృతం చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య అన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం రాయపోల్ గ్రామంలో జిల్లా కార్యనిర్వాక అధ్యక్షులు ఎస్ లక్ష్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజలకు నష్టం కలిగిస్తుందన్నారు. వామపక్ష పార్టీలు, వ్యవసాయ కార్మిక సంఘాలు ఎన్నో పోరాటాల ఫలితంగా గ్రామీణ ఉపాధి పథకం వచ్చిందన్నారు. ఉపాధి హామిపథకానికి 2 లక్షల 85 వేల కోట్ల రూపాయలు కేటాయించి 200 రోజులు పనులు కల్పించి రోజు కూలి కొలతలతో సంబంధం లేకుండా రూ. 700 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నూతన డివిజన్ కమిటీ ఎన్నుకొన్నారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా ఎస్ లక్ష్మయ్య, అధ్యక్షులుగా ఎన్ శ్రీశైలం, ఉపాధ్యక్షులుగా సిహెచ్ మహేష్, బి గాలయ్య, ప్రధాన కార్యదర్శిగా ములుగు నరసింహ, సహాయ కార్యదర్శులుగా మేకల రామకృష్ణ, జంగిలి నరసింహ, మరో ఐదు మందిని కౌన్సిల్ సభ్యులుగా మొత్తం 11 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

తండ్రి బాటలో కుమార్తె.. ప్రజాసేవలో ఇద్దరూ

ఒకే వైద్య ఆరోగ్య శాఖలో తండ్రీ-కుమార్తె విధులు.. అరుదైన అనుబంధం

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 22 (జనంసాక్షి) : తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ కుమార్తె కూడా వైద్య వృత్తిని ఎంచుకుని ప్రజారోగ్య సేవలో భాగస్వామి కావడం అరుదైన ఘట్టంగా నిలిచింది. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో తండ్రీ-కుమార్తె ఒకే శాఖలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందించడం అందరి దృష్టిని ఆకర్షించింది. జిల్లాలో సబ్ నేషనల్ ఇమ్యునైజేషన్ డే (పల్స్ పోలియో) ఆదివారం కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలియో కేంద్రాలను తనిఖీ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.ఆనంద్‌కు మేడ్చల్ లో వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న తన కుమార్తె డాక్టర్ పూజ ఎదురయ్యారు. విధి నిర్వహణలో నిమగ్నమైన కుమార్తెను చూసిన తండ్రి ఆనందం వ్యక్తం చేశారు. ఒకవైపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిగా ప్రజారోగ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న డాక్టర్ ఆనంద్.. మరోవైపు వైద్యాధికారిగా ప్రజలకు



సేవలందిస్తున్న డాక్టర్ పూజ.. ఇలా ఇద్దరూ ఒకే ప్రభుత్వ శాఖలో ప్రజాసేవలో భాగస్వాములు కావడం ప్రత్యేకతను సంతరించుకుంది. తండ్రి వృత్తినే ఆదర్శంగా తీసుకుని కుమార్తె కూడా అదే రంగంలో సేవలందించడం పలువురికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

ఆరుట్లలో బుగ్గ రామలింగేశ్వర స్వామి జాతర వాల్ పోస్టర్ విడుదల

అధికార పార్టీ తీరుపై పాలకమండలి ఆగ్రహం

అందరం కలిసికట్టుగా జాతరను విజయవంతం చేద్దాం

సర్పంచ్ మానిపాటి శోభా కుమార్, ఉప సర్పంచ్ నూకం రాజు

రంగారెడ్డి , నవంబర్ 22(జనంసాక్షి): మంచాల మండలం ఆరుట్ల గ్రామంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి జాతర ఉత్సవాలు ఈ నెల 24వ తేదీ పౌర్ణమి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆరుట్ల గ్రామపంచాయతీ పాలకమండలి ఆధ్వర్యంలో బుగ్గ రామలింగేశ్వర స్వామి జాతర ఉత్సవాల వాల్ పోస్టర్‌ను గ్రామ సర్పంచ్ మానిపాటి శోభా కుమార్, ఉప సర్పంచ్ నూకం రాజు ముదిరాజ్, పాలకమండలి సభ్యులు, వివిధ కుల సంఘాల నాయకులు, గ్రామస్తులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా పాలకమండలి సభ్యులు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ పాలకవర్గానికి కనీసం గౌరవం ఇవ్వకుండా, ఆహ్వానించకుండా, అధికార పార్టీని అడ్డుపెట్టుకుని కొంతమంది ఇష్టానుసారంగా వాల్ పోస్టర్ విడుదల చేయడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. దేవాలయ కమిటీ విడుదల చేసిన వాల్ పోస్టర్‌లో సర్పంచ్, ఉప సర్పంచ్ ఫోటోలు ముద్రించి, ప్రజల ఓట్లతో గెలిచిన వార్డు సభ్యుల ఫోటోలు వేయకుండా.. నామినేట్ సభ్యుల ఫోటోలు ముద్రించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అది తాత్కాలిక దేవాలయ కమిటీ అని చెప్పిన నాయకులు, అధికారులు ప్రజల ఓట్లతో ఎన్నికైన ప్రజాప్రతినిధుల ఫోటోలను ఎందుకు ముద్రించలేదని



ప్రశ్నించారు. గతంలో ఎమ్మెల్యే ముందుగా గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని సంప్రదించి, జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించేవారని గుర్తు చేశారు. అధికార పార్టీని అడ్డుపెట్టుకుని ఎవరు ఏం చేస్తున్నారో గ్రామ ప్రజలందరూ గమనిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని గౌరవించకుండా అధికార పార్టీ నాయకులు పోస్టర్ విడుదల చేసిన తర్వాతే తాము పాలకమండలి సభ్యులు, గ్రామస్తులతో కలిసి వాల్ పోస్టర్ విడుదల చేశామని తెలిపారు. ఇప్పటికైనా దేవాలయ కమిటీ సభ్యులు, అధికార పార్టీ నాయకులు స్పందించి, ఆరుట్ల గ్రామ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయకుండా అందరం కలిసికట్టుగా బుగ్గ రామలింగేశ్వర స్వామి జాతర ఉత్సవాలను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంచాల సహకార సంఘం మాజీ చైర్మన్ మొద్దు సికిందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ మనకు ఇందిర, మాజీ ఎంపీటీసీ చీరాల రమేష్, సహకార సంఘం డైరెక్టర్ కొంగర జనార్దన్ రెడ్డి, న్యాయవాది మంకు మురళి, గ్రామ పెద్దలు వెదిరె దిలీప్ రెడ్డి, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ యూసుఫ్ అలీ ఉన్నారు.

రీజెన్సీలో 'ఆర్ టేబుల్ 94 2.0 - నమస్తే ఫ్రాన్స్; బొంజోర్ ఇండియా'

హైదరాబాద్, జనంసాక్షి : భారత్ - ఫ్రాన్స్ చిరకాల స్నేహ బంధాన్ని చాటి చెప్తూ ఖైరతాబాద్‌లోని ఎర్ర మంజిల్ వద్ద ఉన్న రీజెన్సీ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ వేదికగా 'ఆర్ టేబుల్ 94 2.0 - నమస్తే ఫ్రాన్స్; బొంజోర్ ఇండియా' పేరిట నిర్వహించిన రెండు రోజుల అంతర్జాతీయ సాంస్కృతిక, పాకశాస్త్ర వేడుక వైభవంగా ముగిసింది. ఫ్రాన్స్ నుంచి వచ్చిన ప్రతినిధి బృందానికి భారతదేశ చారిత్రక ప్రస్థానం, సాంస్కృతిక సంప్రదాయాలు, ప్రాంతీయ వైవిధ్యం, ఆహార వారసత్వ ప్రత్యక్ష అనుభూతిని అందించింది. ఆహారం, సంస్కృతి, ఆతిథ్యం అనే అంశాల ద్వారా రెండు శక్తివంతమైన సంస్కృతులను ఏకం చేస్తూ భారత్ - ఫ్రాన్స్ దేశాల మధ్య ఉన్న చిరకాల స్నేహాన్ని ఇది చాటి చెప్పింది. ఈ సందర్భంగా రీజెన్సీ కాలేజ్ ప్రిన్సిపాల్ పీ రమేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ హాస్పిటాలిటీ విద్యలో అంతర్జాతీయ అనుభవం, ప్రయోగాత్మక అభ్యాసానికి ఎనలేని ప్రాధాన్యత కలదన్నారు.



ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల దృక్పథాన్ని, సాంస్కృతిక, అంతర్జాతీయ ఆతిథ్య ప్రమాణాలపై అవగాహన కల్పిస్తాయన్నారు. తద్వారా వారిని ప్రపంచ స్థాయి ఉద్యోగ అవకాశాలకు సిద్ధం చేస్తాయన్నారు. ఈ ప్రతిష్టాత్మక వేడుకను విజయవంతంగా నిర్వహించడంలో అంకితభావంతో పని చేసిన యాభై మంది మూడో సెమిస్టర్ బీసీటీసీఏ విద్యార్థులు, గ్యాస్ట్రోనమీ బృందాలు, స్టూడెంట్ క్లబ్‌లు, అధ్యాపకులు, సహాయక సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా జీన్-పియర్ రేనాడ్ (ఏఏఎన్ఏ & వైస్-ప్రెసిడెంట్, నోవెల్లె-అక్విటైన్ - బోర్డియక్స్ రీజియన్) మాట్లాడారు. భారతదేశ చారిత్రక వారసత్వం, తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయాలు, పాకశాస్త్ర నైపుణ్యాన్ని అత్యద్భుతంగా ప్రదర్శించిన విద్యార్థులు, అధ్యాపకుల కృషిని అభినందించారు.




జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విజయవంతం

రాజేంద్రనగర్,నవంబర్22(జనంసాక్షి) : విక్టరీ షటిల్ స్మాషర్స్ ఆధ్వర్యంలో అవినాష్ లకిడే నిర్వహణలో జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విజయవంతంగా నిర్వహించారు. అండర్-11, 13, 15, 17 బాలబాలికల విభాగాల్లో పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కస్తూరి శ్రవణ్ ముదిరాజ్ హాజరయ్యారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన అవినాష్ లకిడే, నిర్వాహక బృందాన్ని ముఖ్య అతిథి అభినందించారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుల ప్రతిభను ప్రశంసించారు.

ఆపదలో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండ

తోటకూర అజయ్ యాదవ్

కీసర (జనంసాక్షి) : ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని మాజీ మేయర్, కాంగ్రెస్ నాయకుడు తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. అనారోగ్యం, ప్రమాదాల బారినపడి ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందే నిరుపేదలకు ఈ ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆదివారం నాగారం డివిజన్ కాంగ్రెస్ నాయకుడు కౌకుట్ల జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ పరిధికి చెందిన పీసీఆర్ కార్మికుడు రమేష్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.60 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ చేతుల మీదేగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందలేని పేదలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఊరటనిస్తోందని, అర్హులైన బాధితులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాధిత కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాశీస్సులు తీసుకున్న కొత్త కిషోర్ గౌడ్ స్రవంతి దంపతులు



బోడుప్పల్-జనంసాక్షి : మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి, బోడుప్పల్ మాజీ డిప్యూటీ మేయర్ కొత్త కిషోర్ గౌడ్ & స్రవంతి దంపతుల పెళ్లిరోజు సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త కిషోర్ గౌడ్ దంపతులను అభినందించి ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు ఆదర్శ దాంపత్య జీవితాన్ని కొనసాగించాలని ఆకాంక్షిస్తూ పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు.